సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం । 15 । జూలై । 2023



స్మగ్లర్లకు 'రెడ్'సిగ్నల్

ఎర్రచందనం స్మగ్లర్ల ఆట కట్టించేందుకు అటవీశాఖ, పోలీసుశాఖలు సంయుక్తంగా ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్‌గా ఏర్పడి తిరుపతి కేంద్రంగా పనిచేస్తున్నారు. -8లో..



భార్యను క్రికెట్ బ్యాటుతో చితకబాదిన టీచర్

భార్య పట్ల క్రూరంగా వ్యవహరించాడు ఓ టీచర్. తాగి రావద్దన్నందుకు ఆమెను క్రికెటు బ్యాటుతో చితకబాదాడు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1140	రూ.1280
రెండోరకం	రూ.960	రూ.1120

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 249 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	425	478
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 318.38 కిలోలు



న్యూస్‌రీల్

వైఎస్సార్ జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్: జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం జిల్లాలోని కొండాపురంలో 18.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చెన్నూరులో 13.4 , ఖాజీపేటలో 10.8, ఒంటిమిట్లలో 9.8 , కడపలో 9.4 , వల్లూరులో 8.8, కమలాపురంలో 6.4, సిద్దవటంలో 4.6, సీకేదిన్నెలో 4.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

రీ సర్వే డీటీలుగా పదోన్నతి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా రెవెన్యూశాఖలో వివిధ చోట్ల సీనియర్ అసిస్టెంట్ హోదాలో పని చేస్తున్న పలువురికి రీ సర్వే తాత్కాలిక డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతులు కల్పించారు. శుక్రవారం కలెక్టర్ విజయరామరాజు ఈ మేరకు ప్రొసీడింగ్స్ జారీ చేశారు. రాజంపేట తహసీల్దార్ కార్యాలయం ఎన్నికల విభాగంలో పనిచేస్తున్న పి.ఫణికృష్ణకు పదోన్నతి కల్పించి అన్నమయ్య జిల్లా రామాపురం రీ సర్వే డీటీగా బదిలీ చేశారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఎం.మధునాయక్‌ను రీ సర్వే డీటీగా బి.కోడూరుకు బదిలీ చేశారు.

యు-విన్ పోర్టల్‌లో వ్యాధి నిరోధక టీకాల వివరాలు

కడప రూరల్: గర్భిణీ స్త్రీలు శిశువులకు వేసే వ్యాధి నిరోధక టీకాల విధానాన్నియు-విన్ పోర్టల్ ద్వారా అమలు చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాక కార్యాలయంలో వైద్య సిబ్బందికి దీనిపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఈ విధానం ద్వారా దేశంలో ఎక్కడైనా వ్యాక్సిన్ వేసుకోవడానికి వీలుకలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వర్‌కుమార్, మధుకర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పెరుగుతున్న విద్యుత్ వినియోగం



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అధికారులు

రాయచోటిటౌన్: విద్యుత్ వాడకం పెరుగుతోంది. దీనికి అనుగుణంగా ఉత్పత్తి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రత్యేక విద్యుత్ అదాలత్ చైర్మన్, ఆర్థిక సభ్యులు రామమోహన్ రావు తెలిపారు. శుక్రవారం రాయచోటిలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని అక్కడిక్కడే పరిష్కరించారు. గ్రీవెన్స్ మార్గాలు ఎక్కువగా వచ్చాయని, అందువల్ల ఆయా మార్గాల ద్వారా వారి సమస్యలను పరిష్కరించుకుంటున్నారని, దీంతో ఫిర్యాదుదారులు తక్కువ సంఖ్యలో వచ్చారన్నారుగతంతో పోల్చుకుంటే విద్యుత్ వాడకం పెరిగిందన్నారు. 13 వేల మెగా వాట్ల ఉత్పత్తి ఉంటే 2004 మెగా వాట్ల వినియోగం ఉందని చెప్పారు. 42శాతం విద్యుత్ ఉత్పత్తి నుంచి 45 శాతానికి పెరిగిందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ సాంకేతిక సభ్యులు ఎస్ఎల్ అంజనీకుమార్, ఈశ్వరయ్య కడప ఎస్ఈ ఎస్.రమణ, ఎగ్జిటీవ్ ఇంజనీర్‌వై. చంద్రశేఖర్‌రెడ్డి, ఏడీఈ,ఏఈలు, విద్యుత్‌శాఖ అధికారులు, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

నైపుణ్యం.. ప్రగతికి సోపానం

- పలు రంగాలలో యువతకు నైపుణ్య శిక్షణ
- జిల్లాలో రెండు స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలలు
- నేడు ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవం



ఊపిరి ఆగిన సమయంలో ఎలా స్పందించాలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కడప కోటిరెడ్డిసర్కిల్: యువతలో అనంతశక్తి దాగి ఉంటుంది. వారికి సరైన మార్గదర్శనం లభిస్తే బంగారు భవిష్యత్తును నిర్మించుకుంటారు. ఇదే ఉద్దేశంతో ప్రభుత్వం పలు రంగాల్లో నైపుణ్య శిక్షణకు శ్రీకారం చుట్టింది. దీంతో యువతీ యువకులు తమకు నచ్చిన రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుని రాణిస్తున్నారు. నేడు ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవ సందర్భంగా కథనం.

వైఎస్సార్ జిల్లాలో సుమారు 30-35 లక్షల జనాభా ఉంటుంది. అందులో 7-8 లక్షల మందికి పైగా యువత ఉండడం విశేషం. ఏటా పదోతరగతి, ఇంటర్మీడియేట్, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేసేవారు సుమారు రెండు లక్షల మంది వరకు ఉంటారు.అందులో కొందరు ఉన్నత విద్యవైపు దృష్టి సారిస్తే మరికొందరు వివిధ కారణాలతో చిన్నపాటి ఉద్యోగాలు,వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే చాలామందిలో ప్రతిభ ఉన్నప్పటికీ సరైన శిక్షణ లేక మారుతున్న కాలంతోపాటు నైపుణాభివృద్ధి చేసుకోలేక నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. ఇలాంటి వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలుకల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలలను ఏర్పాటు చేస్తోంది.



ఉపాధే లక్ష్యంగా

కొత్తగా ఏర్పడే పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించారు. అయితే స్కిల్స్ ఉన్న వారికి మాత్రమే కంపెనీలు ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇస్తుండడంతో జిల్లాలో ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ చదువులు చదివిన వారికి అందుకు అనుగుణంగా శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా వైఎస్సార్ జిల్లాలో కడప, పులివెందులలో స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలలను ఏర్పాటు చేసింది.

సీ-డ్యాప్ చెంత యువత

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన ద్వారా డీడీయూజీకేవై ద్వారా గ్రామీణ యువతపై ప్రత్యేక దృష్టి సారించింది. గ్రామీణ పేద యువతను ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక శక్తిగా మార్చడం. రాష్ట్ర స్థాయి సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్, ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ప్రోగామ్‌ను అమలు చేస్తున్నారు. 19-35 సంవత్సరాల వయస్సు గల పాఠశాల, కళాశాలల డ్రాపౌట్లపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పిస్తున్నారు. కడపలోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో వివిధకోర్సుల్లో సీ-డ్యాప్ స్కిల్ ఎడ్యుకేషన్ హెల్త్ ఎలక్ట్రానిక్ సెక్టార్ల నుండి ఎమెర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, ఫీల్డ్ టెక్నీషియన్, కంప్యూటింగ్ ఫెరిఫెరల్స్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ ట్రేడ్లలో ఉచితంగా శిక్షణలను అందిస్తోంది.

వివిధ కోర్సుల్లో శిక్షణ: ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్, రీటైల్ సేల్స్ అసోసియేట్, కమలాపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, కస్టమీర్ కేర్ ఎగ్జిక్యూటివ్, పోరుమామిళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్; రీటైల్ సేల్స్ అసోసియేట్, మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, రీటైల్ సేల్స్ అసోసియేట్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

నైపుణ్య శిక్షణతో ఉద్యోగం



నేను ఇంటర్మీడియేట్ చదువుకున్నాను. చాలా ఇంటర్వ్యూలకు వెళ్లినా ఉద్యోగం రాలేదు. ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా శిక్షణ తీసుకుంటున్నా. ఒక ప్రముఖ కంపెనీకి ఎంపికై ఉద్యోగం చేస్తున్నాను. సరైన శిక్షణ లేక చాలామంది ఇంటర్వ్యూలను ఎదుర్కొలేక పోతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నాను. **- ఎస్.రాజి, ఇంటర్మీడియేట్, తాడిపత్రి**

కుటుంబానికి ఆసరాగా



నేను బీటెక్ చదివాను. ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీడీయూజీకేవైలో శిక్షణ తీసుకున్నాను. నైపుణ్యాలపై మాస్టర్స్ ట్రైనర్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం ఓ కంపెనీలో ఉద్యోగం సాధించి మంచి జీతంతో నా కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాను.

- ఆర్.నాగవేణి, బీటెక్, నందికొట్కూరు, కర్నూలు జిల్లా

కమ్యూనికేషన్‌లో పట్టు సాధించా



ఇంటర్ వరకు చదివి చిన్న చిన్న పనులు చేసుకుంటున్నాను. నిహార్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నారని తెలిసి ఇక్కడ శిక్షణ తీసుకుంటున్నాను. కంప్యూటర్ హార్డ్‌వేర్, కమ్యూనికేషన్‌లో పట్టు సాధించాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

- బి.హరిత, ఇంటర్మీడియేట్, సుండుపల్లె, అన్నమయ్య జిల్లా

వృత్తి నైపుణ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి



నిరుద్యోగ యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాలను అమలుచేస్తున్నాం. నైపుణాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ పూర్తవగానే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం.

- డి.నాగార్జున, జిల్లా నైపుణాభివృద్ధి అధికారి, కడప

ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లతో ఉపాధి



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రవిచంద్రబాబు

మదనపల్లె సిటీ: ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు ఎక్కువ ఉన్నాయని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రవిచంద్రబాబు అన్నారు. స్థానిక సీఎల్ఆర్‌సి భవనంలో శుక్రవారం మదనపల్లె,తంబళ్లపల్లె, ములకలచెరువుల ఆర్‌బీకె సిబ్బందికి ప్రధానమంత్రి ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్దీకరణ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పరిజ్ఞానం ఉన్నవారికి ఆధునికతను జోడించి వ్యాపారాన్ని సమున్నత స్థాయికి తీసుకెళ్లడానికి సంకల్పించినట్లు తెలిపారు. యువత ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పరిశ్రమల స్థాపనకు ముందు రావాలని కోరారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి ఈశ్వరప్రసాద్‌రెడ్డి ,జిల్లా వ్యవసాయ మండలి సభ్యులు బొదుషా వల్లి, డీఆర్‌పిలు మహేష్, గోరర్ధన్ పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు జడ్జిని కలిసిన కలెక్టర్



సుప్రీంకోర్టు జడ్జిగా నియమితులైన ఎస్వీ భట్టిని శుక్రవారం రాత్రి అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని వారి గృహంలో కలెక్టర్ గిరీషా పీఎస్ కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

పెద్దదర్గాను సందర్శించుకున్న సాయిధరమ్‌తేజ్



పెద్దదర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న సాయిధరమ్ తేజ్

కడప కల్చరల్ : సినీ హీరో సాయిధరమ్ తేజ్ శుక్రవారం కడప నగరానికి వచ్చారు. ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రమైన అమీన్‌పీర్(పెద్ద)దర్గాను దర్శించుకున్నారు. దర్గా ముజావర్ ఆయనను సాదరంగా ఆహ్వానించి తొలుత ప్రధాన గురువుల మజార్ వద్ద ప్రార్థనలు చేయించారు. అనంతరం ఆ ప్రాంగణంలోని ఇతర గురువుల మజార్ల వద్ద కూడా ప్రార్థనలు నిర్వహింపజేశారు. ఫాతెహా నిర్వహించి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా దర్గా గురువుల చరిత్ర, క్షేత్ర మహిమ గురించి వివరించారు. సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ దర్గాను దర్శించుకోవడం భాగ్యంగా భావిస్తున్నామని, ఎంతో మనశ్శాంతిగా ఉందని తెలిపారు. రాజకీయాల గురించి పాత్రికేయులు ప్రస్తావించగా, తనకు అభిమానం మినహా రాజకీయాల పట్ల అవగాహన లేదని ముక్తసరిగా సమాధానమిచ్చారు. కాగా, అంతకు ముందు ఆయన శ్రీ విజయదుర్గాదేవి ఆలయాన్ని దర్శించుకున్నారు. అభిమానులు పెద్ద ఎత్తున హాజరై భారీ పూలమాలలను క్రేన్ సాయంతో అలంకరించారు.

ఒంటిమిట్ట రామయ్య సేవలో..

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో వెలసిన మూల మూర్తులను శుక్రవారం సినీ హీరో సాయి ధర్మతేజ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ రంగమండపంలో స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ఐఐఎస్‌ఎంఐబీలో అధికారిగా ధర్మానాయక్ ఎంపిక




ఉత్తమ పీఆర్‌ఓగా ప్రశంసా పత్రం అందుకుంటున్న ధర్మానాయక్ (ఫైల్)

రాయచోటి: ఇటీవల యూపీఎస్సీ ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ మినిస్ట్రీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్‌లో సీనియర్ గ్రేడ్ గెజిటెడ్ ఆఫీసర్ పోస్టుకు సంబంధించి విడుదల చేసిన ఫలితాలలో అన్నమయ్య జిల్లా ఐఅండ్‌పీఆర్‌ఓ బుక్యె ధర్మానాయక్ ఎంపికయ్యారు. ఈయన సుండుపల్లె మండలం, వైఎస్ పాళెం కుప్పగుట్టపల్లెకు చెందిన వారు. యూపీపీఎస్సీ ద్వారా 34 ఉద్యోగాలకు సంబంధించి దేశవ్యాప్తంగా 267 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. అందులో ఎస్టీ కేటగిరీకి సంబంధించి ధర్మానాయక్ ఎంపికయ్యారు. ఇప్పటికే సమాచారశాఖలో పౌర సంబంధాలశాఖ అధికారిగా 2019 సెప్టెంబర్ నుంచి కర్నూలులో, ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం చేయడంతో జిల్లా ఇన్‌చార్జిమంత్రి, కలెక్టర్ చేతులు మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు.ధర్మా నాయక్‌కు భార్య మూడే శిరీషా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేంద్రప్రభుత్వ ఉద్యోగిగా ఎంపికైన నాయక్‌ను జిల్లా సమాచారశాఖ జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి, డీపీఆర్‌ఓ పురుషోత్తం అభినందించారు.

అంగన్వాడీ భవనాలు త్వరగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : నాడు నేడులో మంజూరైన అంగన్వాడీ భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఐసీడీఎస్ సీడీపీఓ సూపర్‌వైజర్లను ఆదేశించారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ రూఫ్ లెవల్‌లో ఉన్న బిల్డింగ్‌లను ఈ నెలాఖరుకల్లా పూర్తి చేయాలన్నారు. నవజాత శిశువు నుంచి ఆరు నెలలు, ఏడు నెలలనుంచి 36 నెలలు, 37 నెలల నుంచి 72 నెలల పిల్లల పెండింగ్ ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ త్వరగా పూర్తి చేయాలన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఉండాల్సిన బరువు కన్నా తక్కువ, ఉండాల్సిన ఎత్తు కన్నా తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్స్ బాలామృతం, గుడ్లు, పాలు, బియ్యం, కందిపప్పు,నూనె క్వాలిటీని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మీ, సీడీపీఓలు,సూపర్‌వైజర్లు, ఐసీడీఎస్ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

75శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలు



రైతులకు గడ్డి విత్తనాలు అందజేస్తున్న అధికారులు

రాజంపేట/రాయచోటి టౌన్(వీరబల్లి): మొక్కజొన్న గడ్డి ద్వారా పాల ఉత్పత్తి పెరుగుతుందని అన్నమయ్య జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై పేర్కొన్నారు. శుక్రవారం వీరబల్లె మండల మట్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడ్డి విత్తనాలు 75శాతం సబ్సిడీతో అందిస్తున్నట్లు చెప్పారు. వీటిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2023-2024 సంవత్సరానికి అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 300 టన్నుల పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే పాడి రైతులకు దానామృతం 50 శాతం సబ్సిడితో అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు రాయచోటిలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో అధికారులు, పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగ్రాసం పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఉప సంచాలకులు డాక్టర్ శ్రీనివాస నాయుడు, అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ ఎస్వీ శివారెడ్డి, డాక్టర్ టి. శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ లోకేష్, డాక్టర్ రవికుమార్, మట్లి గ్రామ సర్పంచి నాగార్జునాచారి, పాల్గొన్నారు.

ప్రగతి రథం..ప్రజా పక్షం

- ఆర్టీసీ ఉద్యోగులు 'మర్యాద రామన్న'లవ్వాలి!
- ప్రయాణికుల మన్ననలు పొందేందుకు ప్రత్యేక కార్యాచరణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కండక్టర్లు, డ్రైవర్లు

మదనపల్లె సిటీ: ఆర్టీసీ బస్సు ప్రయాణికుల పట్ల మర్యాద రామన్నలుగా వ్యవహరిస్తూ వారి మన్ననలు పొందాలని కండక్టర్లు, డ్రైవర్లకు యాజమాన్యం ఆదేశించింది. తద్వారా ఆర్టీసీ ఆదాయాన్ని మెరుగు పరచాలని నిర్దేశించింది. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన (ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశాక) తర్వాత ఆర్టీసీ ఉద్యోగుల విధి నిర్వహణపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు ఓ సర్వేలో తేలిందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ ఉద్యోగులు తమ లోపాలను గుర్తెరిగి ప్రయాణికుల మన్ననలు పొందడంతో పాటు రాబడిని పెంచుకోవాల్సిన ఆవశ్యత ఏర్పడిందని పేర్కొంది. కోవిడ్‌కు ముందు ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీరేషియో(ఓఆర్) బాగా ఉండగా ప్రస్తుతం తగ్గిపోతున్న విషయాన్ని గుర్తు చేసింది. జిల్లాలో అయిదు డిపోల్లో ఇందు కోసం ఆయా డిపోల పరిధిలో సిబ్బందికి అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నిరంతరం ప్రయాణికులఅతో స్నేహ బంధం కొనసాగించేలా దిశానిర్దేశం చేస్తోంది.

ఆదేశాలివి..

- ప్రయాణికుల మన్ననలు పొందుతూ సంస్థ ఆదా యం పెంచుకోవడానికి విధిగా చేపట్టాల్సిన అంశాలను యాజమాన్యం కండక్టర్లు, డ్రైవర్లకు సూచించింది.
- ప్రతి స్టేజీలోనూ డోర్ వద్ద కండక్టర్ నిలబడి బస్సు వెళ్లే ఊరు, మధ్యలో వచ్చే ఊళ్లు, స్టేజీల పేర్లను వినిపించేలా గట్టిగా చెబుతూ ప్రయాణికులను ఎక్కించుకోవాలి.
- ప్రయాణికులు చెయ్యెత్తిన చోట బస్సు ఆపి ఎక్కించుకోవడమే కాదు.. కోరిన చోట ఆపి దింపాలి.
- ప్రధానమైన ట్రాఫిక్ జంక్షన్లలో సమయపాలన పాటిస్తూ బస్సును 2,3,5 నిమిషాల పాటు ఆపాలి.
- బస్‌పాస్ ఉన్న ప్రయాణికులు, వృద్ధులు, మహిళలు, వికలాంగుల పట్ల కూడా మరింత గౌరవంగా ప్రవర్తించాలి.
- ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు రాకుండా విధులు నిర్వహించాలి.
- ప్రతి ట్రిప్పులోనూ లక్ష్యం మేరకు ఆదాయం వచ్చేలా కృషి చేయాలి.
- కార్గో ఆదాయాన్ని పెంచుకునే మార్గాలనూ అన్వేషించాలి.
- నెలలో ఒక వీక్ ఆఫ్‌ను స్వచ్ఛందంగా పరిరక్షణ కార్యక్రమంలో పాల్గొనాలి.
- కండక్టర్లు,డ్రైవర్లు సఖ్యతతో విధులు నిర్వర్తించాలి.

డిపో	కండక్టర్లు	డ్రైవర్లు
మదనపల్లె-1	191	181
మదనపల్లె-2	144	181
రాయచోటి	193	198
రాజంపేట	147	104
పీలేరు	191	161

ప్రయాణికులు చేరువకావాలనే..



ఆర్టీసీ ప్రయాణికులకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో యాజమాన్యం ఆదేశాలతో ప్రయాణికులతో సత్సంబంధాలు పేరిట శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గేటు మీటింగ్ ద్వారా ప్రయాణికుల ప్రాముఖ్యత వివరిస్తున్నాం. ప్రయాణికులతో సత్సంబంధాలు పెరిగితే ఆదాయం కూడా పెరుగుతుంది.

-మూరే వెంకటరమణారెడ్డి, ఆర్టీసీ వన్ డిపో మేనేజర్, మదనపల్లె

డీసీసీ బ్యాంకు జీఎంగా రాజామణి

కడప అగ్రికల్చర్(వైఎస్సార్ జిల్లా): కడప డీసీసీ బ్యాంకు డీజీఎంగా పని చేస్తున్న రాజామణికి జనరల్ మేనేజర్(జీఎం)గా పదోన్నతి లభించింది. ఈమెతోపాటు మరో ఇద్దరు చీఫ్ మేనేజర్లు ఏజీఎంలుగా పదోన్నతి పొందారు. శుక్రవారం కడప డీసీసీ బ్యాంకులో ఆప్‌కాబ్, డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, ప్రావిజినల్ డైరెక్టర్ వీరారెడ్డి, ఆప్‌కాబ్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజయ్య, జనరల్ మేనేజర్ వెంకటరత్నం, కడప డీసీసీ బ్యాంకు సీఈఓ రాజేంద్రకుమార్‌లు ఇంటర్వ్యూలను నిర్వహించి అర్హతలను బట్టి పదోన్నతులను కల్పించారు. ఇందులో రాజామణికి జనరల్ మేనేజర్‌గా, వీరబ్రహ్మం, రాజేంద్ర కుమార్‌రెడ్డిలకు ఏజీఎంలుగా పదోన్నతులను కల్పించారు. పదోన్నతుల ఉత్తర్వులను డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఝాన్సీరాణి చేతుల మీదుగా అందచేశారు.

సోదరి అంత్యక్రియల్లో లోకాయుక్త

– లక్ష్మణరెడ్డికి పలువురి పరామర్శ



సోదరి పాడె మోస్తున్న లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి

పెద్దతిప్పసముద్రం : రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి సోదరి పుల్లారెడ్డిగారి శకుంతలమ్మ (87) గురువారం కర్నూలులో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమె పార్థివదేహాన్ని శుక్రవారం స్వగ్రామమైన మండలంలోని టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లెకు తీసుకొచ్చి దహనక్రియలు నిర్వహించారు. లక్ష్మణరెడ్డి సోదరి పాడె మోశారు. శకుంతలమ్మ మనువడు వినోద్‌రెడ్డి చితికి నిప్పంటించారు. డీఎస్పీలు కోలార్ క్రిష్ణ, గంగరాజు, లోకాయుక్త సెక్రటరీ అమరేంద్రరెడ్డితో పాటు పార్టీలకతీతంగా నాయకులు, ప్రజా ప్రతినిధులు చల్లపల్లి నరసింహారెడ్డి, పి.శ్రీనాథ్‌రెడ్డి, ఎంఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, సురేంద్రబాబురెడ్డి, బుచ్చిగారి సుబ్బిరెడ్డి, శారద, క్రిష్టారెడ్డి, కుడుం శ్రీనివాసులు, సీపీ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు నివాళులు అర్పించి లోకాయుక్తను పరామర్శించారు.

స్మగ్లర్లకు రెడ్‌సిగ్నల్

- నాలుగేళ్లలో 202 ఎర్రచందనం అక్రమ రవాణా కేసులు
- ఒకటికి రెండుసార్లు పట్టుబడితే పీడీ యాక్ట్
- 1279 మంది నిందితుల అరెస్ట్, 3135 ఎర్రచందనం దుంగలు సీజ్
- ఫలితమిస్తున్న అటవీశాఖ, పోలీసుల కార్యాచరణ



ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ విభాగంవారితో కలిసి పరిశీలిస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ (ఫైల్)



నిందితుడు ఇరగంరెడ్డి నాగదస్తగిరి రెడ్డి (ఫైల్)



నిందితుడు సింపతి జాకీర్ (ఫైల్)

కడప డెస్క్ : ప్రపంచంలోనే ఎక్కడా పెరగని అరుదైన వృక్షం ఎర్రచందనం. కేవలం రాయలసీమ జిల్లాల్లో మాత్రమే ఈ వృక్షాలు పెరుగుతాయి. ఎన్నో ఉపయోగాలు కలిగిన ఎర్రచందనం ఎక్కడా దొరకదు కాబట్టి దానికి ప్రపంచ మార్కెట్‌లో ఎనలేని గిరాకీ ఉంది. అందుకే స్మగ్లరు అడవులను ఇష్టానుసారంగా నరికి ఎర్రచందనాన్ని జిల్లాలు, రాష్ట్రాలు, చివరికి దేశం నుంచి కూడా దాటించి సొమ్ము చేసుకుంటున్నారు.అటవీ ప్రాంతంలో కూలీల స్థాయి నుంచి మేస్త్రీలు, జిల్లా స్థాయి స్మగ్లర్ల మొదలు అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ స్మగ్లర్ల వరకు వివిధ కేటగిరీల్లో ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఎర్రచందనం తరలిపోకుండా పోలీసులు, అటవీశాఖ అధికారులు కఠిన చర్యలు చేపడుతున్నారు.

బృందాలుగా కార్యాచరణ

ఎర్రచందనాన్ని అక్రమంగా తరలిస్తున్న స్మగ్లర్ల ఆట కట్టించేందుకు అటవీశాఖ, పోలీసుశాఖలు సంయుక్తంగా ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్‌గా ఏర్పడి తిరుపతి కేంద్రంగా పనిచేస్తున్నారు. దీనిని డీఐజీ స్థాయి అధికారి పర్యవేక్షిస్తున్నారు. వారితో పాటు ఎస్పీ, అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, అటవీశాఖ సిబ్బందితో కలిసి బృందంగా ఏర్పాటు చేశారు. ఈ బృందం నిత్యం అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహిస్తూ ఎర్రచందనం అక్రమంగా తరలిపోకుండా చూస్తోంది. మరోవైపు రాయలసీమలోని ఆయా జిల్లాల ఎస్పీల నేతృత్వంలో ఆర్‌ఎస్‌టీఎఫ్ (రెడ్ శాండిల్ టాస్క్‌ఫోర్స్) బృందం ఏర్పాటై ఎర్రచందనం అక్రమ రవాణా నేరాల నియంత్రణకు కృషి చేస్తోంది. ఈ విభాగాన్ని నేరుగా ఓఎస్‌డీ లేదా అదనపు ఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేయబడిన అటవీ, పోలీసు శాఖల చెక్‌పోస్ట్‌లలో 24/7 నిఘాతో సీసీ కెమెరాలతో పాటు, సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వహిస్తున్నారు.

వైఎస్ఆర్ జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందంలో ప్రధానంగా జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ నేతృత్వంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీతో పాటు ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ చెంచుబాబు, ఇన్‌స్పెక్టర్ బి.నాగభూషణ్ తదితర సిబ్బంది పనిచేస్తున్నారు.

జిల్లాలో గత ఏడాదిగా పోలీసులు నిర్వహించిన విస్తృతదాడుల్లో పలువురు ఎర్రచందనం స్మగ్లర్లు పట్టుబడ్డారు. కొన్ని ఉదాహరణలు..

- 2022 సెప్టెంబర్, 8న తెల్లవారుజామున 5:30 గంటల సమయంలో ఒంటిమిట్ట మండలంలోని నర్వకాటపల్లె సమీపంలోని అటవీప్రాంతంలో అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంచిన సుమారు టన్ను బరువున్న 49 ఎర్రచందనం దుంగలను సీజ్ చేశారు. వీటితో పాటు రెండు కార్లు, రెండు ద్విచక్రవాహనాలు, ఏడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనలో నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం ఏఎస్ పేటకు చెందిన మహమ్మద్‌బాషతో పాటు మొత్తం 9 మంది అంతర్ జిల్లా ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేశారు.
- గత ఏడాది అక్టోబర్ 25న జిల్లాలోని కాశినాయన మండలం సావిశెట్టిపల్లె గ్రామం పడమర దిక్కున నల్లమల అటవీప్రాంతంలో జింకపిల్ల గొంది వద్ద దాచి వుంచిన టన్ను బరువున్న 57 ఎర్రచందనం దుంగలను, కారు, రెండు మోటార్ సైకిళ్లను, ఐదు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనలో జిల్లాలోని కలసపాడు మండలం మహానందిపల్లెకు చెందిన సగిలి భాస్కర్‌తో పాటు మరో ముగ్గురిని అరెస్ట్ చేశారు.
- గత ఏడాది నవంబర్ 27న జిల్లాలోని లంకమల్ల అటవీప్రాంతంలో బ్రహ్మంగారి మఠం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎర్రచందనం స్మగ్లర్లపై పోలీసులు దాడులు నిర్వహించారు. తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లా మరక్కనూర్ గ్రామానికి చెందిన వెల్లియాన్ దశరథతో పాటు, మరో 15 మంది ఎర్రచందనం స్మగ్లర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి టన్ను బరువున్న 49 ఎర్రచందనం దుంగలను, లారీ, రెండు కార్లు, 8 సెల్‌ఫోన్‌లతో పాటు ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.
- ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న జిల్లాకు చెందిన అంతర్ రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్లపై పీడీ యాక్ట్‌ను ప్రయోగించారు. వీరిలో జిల్లాకు చెందిన ఇద్దరు ప్రధాన ఎర్రచందనం స్మగ్లర్లపై పీడీ యాక్ట్‌ను ప్రయోగించారు. వీరిలో ప్రధానంగా జిల్లాలోని చాపాడు మండలం ఖాదర్‌పల్లెకు చెందిన షేక్ సింపతి జాకీర్ అలియాస్ చింపతి జాకీర్ (27), ప్రొద్దుటూరు టౌన్ అమృతనగర్‌లో నివాసం వుంటున్న ఇరగంరెడ్డి నాగదస్తగిరి రెడ్డి (34) వున్నారు. 2014 నుంచి ఇప్పటివరకు జాకీర్‌పై 84 కేసులు, నాగదస్తగిరి రెడ్డిపై 87 కేసులు నమోదయ్యాయి.
- జిల్లాలో 2019 నుంచి ఇప్పటివరకు 202 కేసులను నమోదు చేశారు. వాటి ద్వారా మొత్తం 1279 నిందితులను అరెస్ట్ చేశారు. 3135 ఎర్రచందనం దుంగలను (వీటి బరువు సుమారు 75.497 టన్నులు), 203 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.
- 2020 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 32 మందిపై పీడీ యాక్ట్‌లను ప్రయోగించారు. 2020లో రెండు, 2021లో 16, 2022లో ఏడు, 2023లో ఇప్పటివరకు ఏడుగురిపై పీడీ యాక్ట్‌లను ప్రయోగించారు.

జిల్లాలో నమోదైన కేసుల వివరాలు

సంవత్సరం	కేసుల సంఖ్య	అరెస్టయిన నిందితులు	దుంగలు (బరువు కిలోల్లో)	వాహనాలు
2019	48	223	887 – 21259	43
2020	53	269	647 – 14917	44
2021	61	543	817 – 21852.15	59
2022	32	151	651 – 14301.6	41
2023 జూన్ వరకు	08	93	133 – 3167	16
మొత్తం	202	1279	3135 – 75497	203

ఎంతటివారినైనా వదలం

జిల్లాలో ఎవరైనా ఎర్రచందనం వృక్షాలను నరికినా, అమ్మినా, కొన్నా, దాచి వుంచినా, అక్రమంగా రవాణా చేసినా, అందుకు ఏవిధంగా సహకరించినా అలాంటి వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. నిందితులపై హిస్టరీషీట్లను తెరుస్తున్నాం. పదేపదే ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై పీడీ యాక్ట్‌లు ప్రయోగించి అమలు పరుస్తాం. ఎర్రచందనం తరలింపు సమాచారం తెలిసిన వెంటనే మాకు అందజేయయండి. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

– జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

డిగ్రీ విద్యార్థిపై హత్యాయత్నం



చికిత్స పొందుతున్న రవి

వాల్మీకిపురం : డిగ్రీ విద్యార్థిపై హత్యాయత్నం జరిగిన సంఘటన వాల్మీకిపురం పొలిమేర్లలో శుక్రవారం ఉదయం జరిగింది. వివరాలు.. తంబళ్లపల్లె మండలం ముద్దలదొడ్డికి చెందిన డిగ్రీ విద్యార్థి రవి (21) మదనపల్లెలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. గురువారం పుట్టిన రోజు వేడుకలకు అని తల్లిదండ్రులతో చెప్పి వాల్మీకిపురానికి వచ్చాడు. శుక్రవారం ఉదయం రవి తీవ్ర రక్తగాయాలతో రైల్వే పట్టాల పక్కనే పడి ఉండడం గమనించిన స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. రవిపై హత్యాయత్నం జరిగి ఉంటుందని స్థానికుల నుంచి అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్థానిక ఎస్ఐ నాగేశ్వర రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రంగనాయకులపేటలో చోరీ



బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

రైల్వేకోడూరు : పట్టణంలోని రంగనాయకులపేటలోని మసీదు వద్ద గురువారం అర్ధరాత్రి దొంగలు ఓ ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. సుంకేసుల మస్తాన్ తన ఇంటి కింద గదిని షాపు కోసం అద్దెకిచ్చి పైనున్న గదిలో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. పిల్లల చదువుకోసం నెలక్రితం మస్తాన్ ఇంటికి తాళం వేసి తిరుపతికి వెళ్లి అక్కడే ఉంటున్నారు. గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మస్తాన్ ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న 20వేల నగదు, నాలుగు తులాల బంగారు , 400 గ్రాముల వెండిని దొంగిలించుకుని పోయారు. మస్తాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

వీఆర్వో సంతకం ఫోర్జరీ

పెద్దతిప్పసముద్రం : వీఆర్వో సంతకాన్నే ఫోర్జరీ చేయడం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో సదరు ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ నిలిచిపోయిన సంఘటన పెద్దతిప్పసముద్రంలో జరిగింది. బూర్లపల్లి పంచాయతీ వీఆర్వో మల్లికార్జున కథనం మేరకు... ఇదే పంచాయతీలోని సొన్నువారిపల్లెలో ప్రజల కోసం గతంలో ప్రభుత్వం కొంత భూమిని కేటాయించింది. సదరు స్థలాల్లో గృహాలు కూడా నిర్మించుకున్నారు. అయితే గృహాల పక్కనే ఉన్న ఖాళీ స్థలాలను కూడా గుట్టుగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఓ వ్యక్తి భావించాడు. గ్రామ కంఠం సర్వే నంబర్ 403/2లోని దేరంగుల రామచంద్ర భార్య దేరంగుల సాలెమ్మకు సంబంధించిన ఖాళీ స్థలం రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి అభ్యంతరాలు లేవని ధృవీకరిస్తూ వీఆర్వో సిఫారసు చేసినట్లు పత్రాన్ని ఈ నెల 11న బి.కొత్తకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందజేశాడు. అదే రోజు వీఆర్వోకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఫోన్ రావడంతో ఫోర్జరీ గుట్టు రట్టయింది. సదరు ధృవీకరణ పత్రంలో ఉన్న సంతకం తనది కాదని, సీలు కూడా నకిలీదని వీఆర్వో చెప్పడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ రద్దయింది. తన సంతకాన్ని ఫోర్జరీ చేసిన ప్రభుత్వ భూమిని పొందే పయత్నం చేసినట్లు తహసీల్దార్‌కు వివరించి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వీఆర్వో తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి



గణేష్(ఫైల్)

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీకి చెందిన ఎం.గణేష్(21) గురువారం రాత్రి మృతి చెందాడు. గంగన్నగారిపల్లెకు చెందిన వెంకట రమణ,గంగసుధ దంపతుల ద్వితీయ కుమారుడు గణేష్ ఇటీవలే ఇంటర్ పూర్తి చేశాడు. మూడు నెలలుగా డీమార్టు షాపింగ్‌మాల్‌లో ప్యాకర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 11వతేదీ మంగళవారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళుతుండగా, బైపాస్‌రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గణేష్ తిరుపతిలోని రమాదేవి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు నెలల చిన్నారిపై వానరం దాడి

కమలాపురం : కమలాపురం మండలం పెద్దచెప్పలికి చెందిన అబ్దుల్ అమన్ అనే ఐదు నెలల చిన్నారిపై వానరం దాడి చేసి గాయపరిచింది. గౌజ్ ఆజం కుమారుడు అమన్ (5నెలలు) ఇంట్లో ఊయలలో నిద్రిస్తుండగా ఇంట్లోకి వచ్చిన వానరం చిన్నారి బుగ్గపై కరిచింది. దీంతో చిన్నారి బుగ్గపై ఐదారు లోతైన కాట్లు పడ్డాయి. అమన్ ఏడుస్తున్నా వానరం వదల్లేదని, తాము వెంటబడి తరిమితే వెళ్లిందని అమన్ తండ్రి గౌస్ వాపోయాడు. అనంతరం అమన్‌ను తల్లిదండ్రులు కడపలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. గ్రామంలో కోతులు ఎక్కువగా ఉన్నాయని, వాటిని పట్టి దూర ప్రాంతాల్లో వదలాలని తహసీల్దార్‌కు గతంలో తాము ఫిర్యాదు చేశామని, అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధిత తండ్రి గౌస్ చెప్పాడు.

కడపలో చోరీ

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప రిమ్స్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఎస్ఆర్ నగర్‌లో చోరీ జరిగింది. తాళం వేసిన ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు తొమ్మిది తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు.గతనెల 30వ తేదీన స్థానికంగా నివాసముంటున్న నిర్మల జగన్నాథ యాత్రకు వెళ్లింది. యాత్రను ముగించుకుని శుక్రవారం ఇంటికి చేరుకుంది. ఇంటి తలుపులు తెరచి ఉండడం చూసి లోపలికి వెళ్లి చూడగా లాకర్‌లో ఉంచిన బంగారు గాజులు, ఉంగరాలు, కమ్మలు, చిన్న చైను కలిపి మొత్తం తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించింది. బాధితురాలు రిమ్స్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ నారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్చ్..ఏం తేలలా..!!

- కురబలకోటలో రూ.1978 మాత్రమే రికవరీ
- ఉపాధి హామీలో తగ్గిన అవకతవకలు



కురబలకోట ప్రజా వేదిక సభలో డ్వామా పీడీ మద్దిలేటి

కురబలకోట : కురబలకోట మండల ఉపాధి హామీ ఇతర అనుబంధ శాఖల పనుల్లో అవకతవకలు, అక్రమాలు పెద్దగా లేవని ప్రజా వేదిక తేల్చింది. కేవలం రూ.1978 మాత్రమే అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందాలు తేల్చాయి. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో డ్వామా పీడీ మద్దిలేటి ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక సభ నిర్వహించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.5.76 కోట్లతో 1543 పనులపై ఈనెల 6 నుంచి సామాజిక తనిఖీ బృందాలు క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించాయి. ఉపాధి హామీ, అనుబంధ శాఖలైన హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, సర్వశిక్షా అభియాన్ ఇతర శాఖల పనులపై ఈ సామాజిక తనిఖీ నిర్వహించారు. మస్టర్లలో పొరపాట్లు వల్ల కేవలం రూ. 1978 రికవరీకి ప్రజా వేదిక సభలో డ్వామా పీడీ మద్దిలేటి ఆదేశించారు. రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు చనిపోగా వాటి స్థానంలో తిరిగి కొత్తవి నాటాలని ఆదేశించారు. ఇంత తక్కువ స్థాయిలో అవకతవకలు జరగడం జిల్లా స్థాయిలో కురబలకోటలో మాత్రమేనని అధికారుల ద్వారా తెలుస్తోంది. ఏపీడీ నందకుమార్ రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి ప్రకాష్, జడ్పీటీసీ బైసాని జ్యోతి, ఎంపీపీ బి. దస్తగిరి, ఎంపీడీఓ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భార్యను క్రికెట్ బ్యాటుతో చితకబాదిన టీచర్

తాగి ఇంటికిరావడంపై ప్రశ్నించినందుకు దాడి



భర్త చేతిలో తీవ్రంగా గాయపడ్డ ఉపాధ్యాయురాలు ప్రభావతి

మదనపల్లె : సమాజంలో గౌరవప్రదమైన వృత్తిలో కొనసాగుతూ భార్య పట్ల క్రూరంగా వ్యవహరించాడు ఓ టీచర్. ఇంటికి తాగిరావడం గురించి ప్రశ్నించిన భార్యను క్రికెటు బ్యాటుతో చితకబాదాడు. పట్టణంలోని ఇసుకనూతిపల్లెకు చెందిన ఉదయ్‌కుమార్, ప్రభావతి భార్యాభర్తలు. ఉదయ్‌కుమార్ నీరుగట్టువారిపల్లె మాయాబజార్ మున్సిపల్ స్కూల్‌లో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ప్రభావతి ములకలచెరువు మండలంలో ఎస్జీటీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. ఉదయ్‌కుమార్ మద్యానికి బానిసవడంతో ఈ విషయమై దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. గురువారం ఉదయ్ కుమార్ మద్యం సేవించి అర్ధరాత్రి ఇంటికి రావడంతో ప్రభావతి తలుపు తీసేందుకు కొద్దిసేపునిరాకరించింది. తలుపు తెరిచిన తర్వాత ఉదయ్ ఆగ్రహంతో లోపలకు వెళ్లి క్రికెట్ బ్యాట్ తెచ్చి భార్యను రక్తం వచ్చేలా కొట్టాడు. భర్త కొట్టిన దెబ్బలకు ప్రభావతి స్పృహ తప్పింది. ఆ తర్వాత ఉదయ్‌కుమార్ శుక్రవారం ఏమీ ఎరగనట్లు తెల్లవారుజామునే పాఠశాల విద్యార్థులను తీసుకుని శ్రీహరికోటలో చంద్రయాన్-3 ప్రయోగాన్ని వీక్షించేందుకు వెళ్లాడు. ఉదయం పాలుపోసేందుకు ఇంటికి వచ్చిన మహిళ ప్రభావతి రక్తగాయాలతో కిందపడి ఉండటం గమనించి చుట్టుపక్కలవారి సాయంతో జిల్లా ఆస్పత్రికి తరలించింది. కూతురిపై అల్లుడు దాడి చేసిన విషయం తెలుసుకున్న బాధితురాలి తండ్రి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అత్తపై కొడవలితో దాడి



తాలూకా పోలీస్‌స్టేషన్ ఎదుట న్యాయం చేయాలంటూ నిరసన తెలుపుతున్న భాగ్యలక్ష్మి

మదనపల్లె : అదనపు కట్నం కోసం వేధించడమే కాకుండా, ఇంటికి పిలిచి అత్త, భార్యపై భర్త దాడికి పాల్పడిన సంఘటన మదనపల్లె మండలంలో గురువారం రాత్రి జరిగింది. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ కృష్ణాపురానికి చెందిన కన్యాకుమారి, హరినాథ్‌ల కుమార్తె భాగ్యలక్ష్మిని మదనపల్లె మండలం వేంపల్లెకు చెందిన ప్రదీప్‌కుమార్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఒక కుమార్తె ఉంది. ప్రదీప్ బెంగళూరులో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ భార్యతో కలిసి అక్కడే నివసిస్తున్నాడు. కొంతకాలంగా ప్రదీప్ భార్యను అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడు. భర్త వేధింపులు భరించలేక భాగ్యలక్ష్మి కుమార్తెతో సహా పుట్టినిల్లు అయిన కృష్ణాపురానికి మూడురోజుల క్రితం చేరుకుంది. గురువారం మాట్లాడుకుని సమస్యను పరిష్కరించుకుందామని భార్య భాగ్యలక్ష్మి(27), అత్త కన్యాకుమారి(50)ని ప్రదీప్‌కుమార్ వేంపల్లెకు పిలుచుకువచ్చాడు. ఇంట్లో వారితో గొడవపడ్డాడు. ఆవేశంలో కొడవలి తీసుకుని అత్త కన్యాకుమారి తలపై నరికాడు. భార్యను విచక్షణారహితంగా కొట్టి గాయపరిచాడు. ఘర్షణలో తీవ్రంగా గాయపడిన వారు స్థానికుల సహాయంతో రాత్రి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి చేరుకుని చికిత్సలు పొందారు. జరిగిన ఘటనపై తాలూకా పోలీసులకు ఫిర్యాదుచేశారు.

న్యాయం చేయాలని స్టేషన్ ఎదుట బాధితురాలి నిరసన

తల్లిపై కొడవలితో దాడిచేయడమే కాకుండా తనను తీవ్రంగా గాయపరిచిన భర్త ప్రదీప్‌కుమార్‌పై కేసు నమోదుచేయడంలో పోలీసులు నిర్లక్ష్యం చూపుతున్నారని శుక్రవారం రాత్రి బాధితురాలు భాగ్యలక్ష్మి తాలూకా పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేసింది. పెళ్లి సమయంలో ప్రదీప్‌కు కట్నంగా రూ.10లక్షల నగదు, బంగారు ఇచ్చామని, అయితే అదనపు కట్నం కోసం వేధిస్తూ తనతో పాటు బిడ్డను చంపేస్తానని బెదిరిస్తున్నాడని వాపోయింది.

మిద్దెపై నుంచి కిందపడి మహిళకు తీవ్రగాయాలు



లక్కిరెడ్డిపల్లి : కూలి పనులకు వెళ్లి మిద్దె పనులు చేస్తుండగా మిద్దెపై నుంచి పడి రజినీ అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. రజిని కుటుంబీకులు కొద్ది రోజుల క్రితం గుర్రంకొండ మండలం, ఖమ్మంగారిపల్లె నుంచి లక్కిరెడ్డిపల్లెకు వచ్చి ఇక్కడ బేల్దారి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రజినీ మిద్దెపైన పనులు చేస్తూ కాలు జారి కింద పడింది. బంధువులు ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు.